**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: apcpimap@gmail.com

**విజయవాడ,**

**15 జూన్, 2023.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రివర్యులు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి గారికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం**

**విషయం : చించినాడ గ్రామ దళితులకు న్యాయం చేయండి.**

**అయ్యా!**

మీరు ఇటీవల కాలంలో తరచుగా రాష్ట్రంలో ధనిక, పేదల మధ్య వర్గ పోరాటం జరుగుతున్నదని, మీరు పేదల పక్షమని ప్రకటిస్తున్నారు. దీన్ని నిజంగా మీరు నమ్మి ఆచరిస్తే సంతోషమే. కానీ మీ ప్రభుత్వ ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం చించినాడ గ్రామంలో గత రెండు మాసాలుగా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం గ్రామ దళితులపై దాడి చేస్తున్నది. వారి పట్టా హక్కులను గాని, హైకోర్టు డైరెక్షన్‌ను గాని లెక్క చేయకుండా ప్రభుత్వ యంత్రాంగం ఇష్టానుసారం వ్యవహరిస్తున్నది. ఇది మీ దృష్టికి కూడా వచ్చి ఉంటుంది. అయినా యధేచ్ఛగా దాడి కొనసాగిస్తున్నారు. అక్కడ దళితులు, పేదలకు వ్యతిరేకంగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా తిరిగి దళితుల పైనే దాడి ఎక్కుపెడుతున్నారు. ఇదేనా మీరంటున్న వర్గ పోరాటం యొక్క అర్థం? ఇదే అయితే మీ ప్రభుత్వం నూటికినూరుపాళ్ళు సంపన్నుల కొమ్ముకాస్తున్నట్లే. ఇప్పటికైనా ఈ క్రింది అంశాలు పరిశీలించి తక్షణం చించినాడ దళితులకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

1983లలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూపంపకంలో భాగంగా చించినాడ గ్రామంలో 280 దళిత కుటుంబాలకు 60 ఎకరాలు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చింది. దాన్ని వారు ఒక సొసైటీగా ఏర్పడి సాగు చేసుకుంటున్నారు. దాన్ని ఆనుకొని గోదావరి ఒడ్డున పెరుగు లంక భూములున్నాయి. ప్రభుత్వ ల్యాండ్ కమిషనర్ జివో ప్రకారం పట్టా భూములను ఆనుకున్న పెరుగు లంక భూములు ఆ రైతులకే చెందుతాయి. కోర్టు కూడా దీన్ని ధృవీకరించింది. ఈ భూములకు అటూఇటూ గోదావరి ఒడ్డున వున్న పెరుగు లంక భూములన్నీ ఆయా రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏ భూముల జోలికీ పోకుండా కేవలం దళితుల భూముల్లోనే మట్టి తవ్వి జగనన్న కాలనీలకు తోలేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఇది పూర్తిగా అన్యాయం. దళితులపై కక్ష సాధింపుతో ప్రభుత్వ యంత్రాంగం చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఈ క్రింది అంశాలను పరిశీలిస్తే దళితుల సమస్య ఎంత న్యాయమైందో మీకే అర్థమవుతుంది.

(1) పెరుగు లంక భూములపై అధికారం దాన్ని ఆనుకుని ఉన్న దళితులదే. 1975 ల్యాండ్ కమిషనర్ ఆఫ్ సర్వే అండ్ సెటిల్‌మెంట్ జివో 147/75 జారీ చేశారు. తర్వాత హైకోర్టు ఆదేశం దీన్ని ధృవీకరించింది.

(2) గోదావరి ఒడ్డుకి 5 అడుగులు కూడా దూరం లేని విధంగా మట్టి తవ్వుతున్నారు. దీని వల్ల గోదావరి పొంగినప్పుడు వరదలు గ్రామాల్లోకి, పొలాల్లోకి పొంగి పొర్లే అవకాశం ఉంది. ఇది నదుల రక్షణ చట్టానికి విరుద్ధం. అయినా మైనింగ్ డిపార్ట్‌మెంట్ మట్టి తవ్వేందుకు అనుమతినిచ్చింది. ఈ భూములపై మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కి ఎలాంటి అధికారం లేదు.

(3) దళితులు తమ పొలాల్లోకి వెళ్ళేందుకు వేసుకున్న రోడ్డును మట్టి తోలేందుకు అక్రమంగా వినియోగిస్తున్నారు. వారు రైతుల నుండి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. నష్టపరిహారం చెల్లించలేదు.

(4) తమ రోడ్డుకి ఇరువైపులా దళితులు కొబ్బరిచెట్లు నాటుకున్నారు. వాటన్నింటినీ ప్రభుత్వయంత్రాంగం కాంట్రాక్టర్లతో కలిసి నాశనం చేయడమే కాకుండా మరలా తిరిగి మట్టి తోలకానికి అనుకూలంగా రోడ్లు వేసుకున్నారు.

(5) తమ పొలాల్లోకి వెళ్ళేందుకు దళిత రైతులను పోలీసులు అనుమతించడంలేదు.

(6) జగనన్న కాలనీలకు మట్టి తోలే పేరుతో లారీలను ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌కు తోలుతున్నారు.

పై అంశాలను పరిశీలిస్తే మట్టి తోలే కాంట్రాక్టరు అన్ని నిబంధనలూ తుంగలో తొక్కి అక్రమంగా భూముల్లోకి ప్రవేశిస్తున్నట్లు అర్ధమవుతుంది. వారిపై ఎలాంటి చర్యా తీసుకోకుండా భూముల పరిరక్షణకు, న్యాయం కోసం పోరాడుతున్న దళితులపై పోలీసులు దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారు. అరెస్టులు చేస్తున్నారు.

మట్టి అక్రమ తోలకాన్ని అడ్డుకున్నందుకు దళితులపై కేసులు బుక్ చేస్తున్నారు. పొలాల్లోకి వెళ్ళేందుకు ప్రయత్నిస్తున్న మహిళలపై లాఠీచార్జి చేసి తలలు పగులగొట్టారు. 13వ తేది శాంతియుతంగా సభ జరుపుకుని రోడ్డు మీదకు వస్తున్న గ్రామ దళితులు, వారికి అండగా వచ్చిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులను ఎలాంటి కారణం లేకుండా అరెస్టు చేశారు. సభకు ముందురోజు గ్రామంలో పోలీసులు దిగి ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. అరెస్టు అయిన వారిని యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో అప్పటికప్పుడు కేసు బుక్ చేసి ఎఫ్ఐఆర్ కూడా రిజిస్టర్ చేశారు. కానీ రాష్ట్రంలో గాని, చించినాడ గ్రామంలో గాని దళితులపై జరిగిన దాడులపై ఫిర్యాదు చేస్తే ఎక్కడా ఇంత వేగంగా స్పందించలేదు. విచారణ పేరుతో రోజులు గడపడం లేదా దళితులను బెదిరించేందుకు కౌంటర్ కేసులు పెట్టడం, కేసు బుక్ చేయకుండా రాజీలు కుదర్చడం వంటి పనులు పోలీసు యంత్రాంగం చేస్తున్నది. అయినా మీరు ఎటువంటి చర్య తీసుకోవడం లేదు. దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను తుంగలో దొక్కి సంపన్నుల కొమ్ము కాయడమే మీ వర్గ పోరాటం లక్ష్యంగా కనిపిస్తున్నది.

కనుక తక్షణం చించినాడలో పోలీసులను ఉపసంహరించి దళితుల భూములు దళితులకు అప్పగించాలి. అక్రమంగా మట్టి తవ్వుతున్న కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి. దీనికి మద్దతు నిలిచిన పోలీసు, రెవెన్యూ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. మీరు స్పందించి చర్య తీసుకోని యెడల దళితులకు వ్యతిరేకంగా మట్టి మాఫియాకు ప్రభుత్వం కొమ్ము కాస్తున్నట్లు భావించవలసి ఉంటుందని విన్నవించుకుంటున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**

రాష్ట్ర కార్యదర్శి